# బొమ్మ బొరుసు

## కెయెస్వర్మ




పతివ్రతల పేర్లు తల్చుకుంటే ముమ్మందుగా జ్ఞాపకం వచ్చేది సావిత్రి పేరు.

భర్తలేని జీవితమే వృధా అని ఆమె అభిప్రాయం. అలాగని భర్తమరణించగానే సహగమనం చేయలేదు. భర్త బ్రతికుండాలనుకుంది. అతని ఆత్మీయత, ఆదరణా జీవితాంతం కావాలనుకుంది. అందుకే నిర్ధాక్షిణ్యంగా తన పతి ప్రాణాల్ని తీసుకుపోతున్న యమధర్మరాజుని అడ్డగించింది. నరకలోకపు భయానకమైన దారిలో ప్రయాణించింది. ఎంతో ప్రయాసతో, తన తెలివితేటల్తో యమధర్మరాజునే సందిగ్ధంలో పడేసింది. అతని నోటి నుండే తనకు సంతానయోగం కలిగేటట్లు వరం పొందింది. భర్తలేకుండా సంతానయోగం లభ్యం కావడం ధర్మమేనా? అని ప్రశ్నించింది.

అనాలోచితంగా వరం ఇచ్చిన యముని పాశంనుండి తన పతి ప్రాణాల్ని విముక్తచేసి తిరిగి తమ నివాసానికి చేరుకుంది.

అటు తర్వాత హాయిగా, భర్తతో అనంతకాలం జీవించింది.

ప్రేమ, వాత్సల్యం, అనురాగం, ఆప్యాయత.... ఇవే స్త్రీకి భర్త నుండి కావలసినవి అని చాటి చెప్పింది సావిత్రి

ఇది పురాణాల నాటి కథ!

రామారావు కలెక్టరాఫీసులో ఎల్. డి. సి. తన సంపాదనతో భార్యని కూడా పోషించగలననే ఆలోచన రాగానే అతను పెళ్ళి చేసుకున్నాడు.

రామారావు భార్య రమణి-

పెళ్ళయిన రెండో రోజునే శోభనానికి ముహూర్తం పెట్టారు పెద్దలు. సినిమాలోని పెళ్ళికూతురిలాగానో, సగటువాడి కూతురిలాగనే సిగ్గుపడిపోయి ముడుచుకుపోలేదు రమణి. హుందాగా నడుచుకుంటూ లోపలికొచ్చి తలుపులు మూసింది.

పాలగ్లాసు రామారావు చేతికిస్తూ "మీ జీతం ఎంతండీ?" అంది మొదటి ప్రశ్నగా.

"ఎన్మిదొందలు" హుషారుగా చెప్పాడు రామారావు.

"ఎన్మిదొందల్లో ఎలా బతుకుతాం" ప్రక్కనే కూర్చుంటూ మరో చికాకు ప్రశ్న.

"ఇలా.." మీదపడి రెండు చేతుల్లో ఆమెని ఇరికిస్తూ సమాధానం.

"అబ్బ ఏమిటది-? చీరనలిగిపోదూ...."మళ్ళీ చిరాకు.

రామారావుని దూరంగా జరిపేసింది రమణి. ఒయ్యారంగా చీర నలిగిపోకుండా జాగ్రత్త పడుతూ అలా....అలా....అతన్ని ఊరించింది. చాలా సేపటివరకూ- ఎన్నో మాటలు చెప్పి చివరకి ఆమె ప్రక్కన చేరాడు రామారావు. ఆమె స్పర్శ మత్తు మత్తుగా ఉంది, కొత్త కొత్తగా ఉంది. గమ్మత్తుగా ఉంది. ఆనంద డోలికల్లో అతని మనస్సు ఊగిపోతోంది. కామం అతన్ని పూర్తిగా ఆవహించింది.

ఎట్టకేలకు ఆమె కూడా అతని దారిలోకి వచ్చింది. కానీ ఆవేశంతో ఉన్న రామారావు వేడి- రెండు క్షణాలకే చల్లారిపోవడంతో ఆమెకు చిర్రెత్తుకొచ్చింది- అతన్ని కసురుకుంది.. చేతులతో కొట్టింది.....కాళ్ళతో తన్నింది... మంచం మీంచి కిందకి తోసేసింది....కోపంగా మొహం గోడకేసి తిప్పుకుని పడుకుండిపోయింది.

మరో అరగంటకి మళ్ళీ లేచాడు రామారావు. కానీ రమణి ఉలుకు, పలుకు లేకుండా అలానే కూర్చుండిపోయింది. రామారావు ఆమెని బ్రతిమాలాడు. బుజ్జగించాడు. నా డార్లింగ్ అన్నాడు కాళ్ళు మొక్కుతానన్నాడు చేతులు పిసికాడు. కాళ్ళు ముద్దెట్టుకున్నాడు.

అయినా చలించలేదు రమణి. ఛీ ఛీ పొమ్మంది. ఆ మాటకొస్తే అసలు నువ్వు మగాడివేకాదంది. నీకు మొగతనం లేదంది.

ఆదిదాన్ని మొదటరాత్రి మొట్టమొదట కలయికలో సంతృప్తి పర్చలేని మగాడు మొగుడే కాదంది-

అంతేకాదు ఆనాటినుంచీ- ఆ తర్వాత ఎప్పుడూ రామరావుని భర్తగానే చూడలేదు, గౌరవించలేదు, అతని మాటలకి విలువివ్వలేదు.

భార్యని శారీరకంగా సంతృప్తిపర్చగలిగినవాడే భర్తఅన్నీ- శారీరక సుఖం తప్ప-అభిమానం, ఆప్యాయతలు. సంసార జీవితంలో అనవసరమనీ ఒక నిర్దిష్ట అభిప్రాయం తీసుకొన్న రమణి, రామారావుతో తనకి పెళ్ళయిన మూడు సంవత్సరాలు కూడా పూర్తికానిదే విడాకులకి దాఖలు చేసింది.

ఇదీ నేటి కథ!

ఈనాటి రమణుల కథ!! ●